# చమురు దీపం

"దొన్కల్... దొన్కల్"

ఏదో పత్రిక చదవడంలో మునిగి ఉన్న నేను, కండక్టర్ అరుపుతో చుట్టూ చూశాను.

నేను దిగాల్సింది దొన్కల్ లోనే.

వెంటనే లేచి ఎయిర్ బ్యాగ్ చంకన వేసుకుని దిగాను.

దుమ్ము రేపుకుంటూ పోయింది బస్సు.

రాతి పలకల చప్టామీద, చెట్ల క్రింద, అక్కడక్కడా కొందరు ప్రయాణీకులు కూర్చున్నారు.

"ఇప్పుడేనా రాకడ కరీంనగరం నుంచి" పలకరించాడు రామయ్యా తాత.

"ఔ తాతా, అంతా మంచిదేనా? యాడికి పోతున్నవ్?"

"మీ సిన్నవ్వ దగ్గరికి కమ్మర్‌పల్లి పోతున్నా, ఇప్పుడే ఆర్మూర్ బస్ దిగినా" చెప్పాడు రామయ్య తాత.

"వాల్గోట్ ఎల్కటూరు బస్‌పోయిందా? ఎంత జెల్ది వద్దామన్నా కుదరకపాయె" అడిగాను.

"లేదు మన్మడా, అదియ్యాల్ల గంటన్నర ఆలస్యంగా పోయింది. ఈడ్నెల్లే మూణ్ణరకు ఆర్మూరు పోయింది. ఆడ్నెల్లి పిప్పెర ట్రిప్ వేసొచ్చేసరికి ఆరుగంటలయిద్దేమో!"

ఊసూరుమన్నాను.

'పల్లె పల్లెకూ బస్సు' అనే మన ప్రభుత్వ నినాదం నిజమే కానీ, కొన్ని వూళ్ళకు బస్సులు రోజుకు రెండు, మూడు ట్రిప్పులు మాత్రమే చేస్తూ ఉంటాయి.

ప్రభుత్వ రికార్డులో దొన్కల్‌గా సమోదైన దొనుకంటి... నిజామాబాద్, కరీంనగర్ రహదారిలో ఉంటుంది.

ఊరు... బస్టాండుకు దాదాపు కిలో మీటరు దూరం.

అక్కడికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉండే రెంజర్ల మా ఊరు!

ఆర్మూర్, ఎల్కటూర్ వయా దొన్కల్ రూటులో వస్తుంది రెంజర్ల.

డిగ్రీ చేసి అయిదేళ్లూ, టీచర్ ట్రైనింగ్ చేసి మూడేళ్ళయిన తర్వాత నాకీ మధ్యే కరీంనగర్‌లో టీచర్ పోస్టింగు వచ్చింది.

ముసలితనంలో మా వాళ్ళకి ఊరు వదలడం ఇష్టం లేకపోవడాన, నేను ఒక్కణ్ణే కరీంనగర్‌లో ఉంటున్నాను.

శనివారం పగలొచ్చి, సోమవారం ప్రొద్దున తిరిగి కరీంనగర్ వెళ్తూ ఉంటాను.

ఉద్యోగంలో స్థిరపడ్డాక పెళ్లి చేసుకోవాలనుకోవడంవల్ల ఇంకా సంసార జంఝాటంలో పడలేదు.

ఇప్పుడు నాలుగున్నర అయ్యింది... ఇంకా దాదాపు గంటన్నర గడపాలి. తొందరగా వెళ్దామన్నా... ఇక్కడ టాక్సీలు గానీ, ఆటోలుగానీ దొరకవ్.

టీ అయినా తాగుదామని రజాక్ బాబా హోటల్లోకి వెళ్లాను.

హోటలంటే ఒక పూరిపాక, తాటాకుల గుడిసె. దాని యజమాని రజాక్ బాబా, దొన్కల్ ద్వారా వచ్చిపోయే ప్రయాణీకులకు ఆప్తుడు.

తమ బస్సు కొరకు గంటలు, గంటలు ఎదురుచూసే వారి ఆకలిదప్పులు తీర్చే ఆపద్బాంధవుడు.

తన దగ్గర బేరం చేసినా, చేయకపోయినా, ప్రతివారినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి బాగోగులను కనుక్కుంటాడు.

కూజాలోని చల్లని నీళ్లిచ్చి వాళ్ళ దప్పిక తీరుస్తాడు. అది చాలదని ముఖం కడుక్కోవడానికీ, కాలకృత్యాలు తీర్చుకోడానికి నీళ్లిస్తాడు.

అతి తక్కువ ధరలో టీ, ఫలహారాలు సరఫరా చేస్తాడు. ఆయన చేతి ఉల్లిపాయ బజ్జీల రుచే వేరు.

కొందరు చుట్టు పక్కల ఊళ్ళవారు, సైకిళ్ళపై దొన్కల్ వచ్చి అక్కడ సైకిళ్ళు పెట్టి బస్సుల్లో దూరపు ఊళ్ళకు వెళ్తారు. వాళ్ళు తిరిగి వచ్చేదాకా సైకిళ్ళ బాధ్యత రజాక్ బాబాదే.

దానికాయన ప్రతిఫలమైమీ తీసుకోడు. అందుకే ప్రతివాళ్లూ రజాక్ బాబాను గౌరవిస్తారు... అభిమానిస్తారు.

"బాగున్నావా రజాక్ బాబా" అడిగాను హోటల్లోకి అడుగుపెడుతూ.

"ఎవరూ దివాకరా? బాగున్నా బేటా. ఇప్పుడు బస్ దిగినవా?" బజ్జీలు వేయిస్తున్న రజాక్ బాబా తన దళసరి కళ్ళద్దాలలోంచి చూస్తూ అడిగాను.

"ఔ బాబా, పగలు బజ్జీలు సేత్తున్నావ్, పొద్దుగల్ల సెయ్యలేదా?"

"సేసిన, అయిపోయినయ్. గాడకూసన్నోల్లు ఎల్కటూరు పోవాలట! 'బస్సుకు ఇంకా గంటకెక్క టైమున్నది, ఆకలయిపోతుంది. ఏమన్న నాస్త ఉందా?' అని అడిగింద్రు... చుడ్వ గూడా అయిపోయింది. బజ్జీలన్న సేద్దమని సేత్తున్న" చెప్పాడు.

టీ, ఫలహారాల ముడి సరుకు తీసుకుని సైకిల్ క్యారియర్‌కు స్టౌ తలిగించుకుని పొద్దున ఆరుగంటలకే వస్తాడు రజాక్ బాబా.

హోటల్ గుడిసెకు తలుపూ, తాళం లేకపోవడంవల్ల సామాను అక్కడుంచడానికి వీలుకాదు. రాత్రి తీసుకెళ్లి పొద్దున తేవాల్సిందే.

పొద్దున్న రాగానే ఉల్లిపాయ బజ్జీలు, మిరప బజ్జీలు, టీ చేస్తాడు. రెండు మూడు రోజులకోసారి ఖారా, చుడ్వా చేస్తాడు.

తన హోటల్లో బిస్కట్లూ, పిప్పరమింట్లూ, బీడీలు కూడా ఉంచుతాడు.

"ప్లేటు బజ్జీలు, చాయ్, ఇయ్యి బాబా"

"ముందుగల్ల గరం గరం బజ్జీలు తిను, అవి తిన్నంక చాయ్ ఇస్త."

బజ్జీలు తింటూ మాటలు కొనసాగించాను.

"బాగా బక్కగయినౌ, పాణం మంచిగ లేదా?"

"లేదు బేటా, రంజాన్ నెల గదా, ఉపాసాలు నడుస్తున్నె, జర థకాయించినట్టున్నది."

"కొడుకు మంచిగ నెలకైదు వేలు పంపంగ, నీకిదేం తిప్పలు బాబా?"

"కొడుకు రూపాయలు పంపిత్తున్నడని ఇంట్ల కూసుండి తింటే మంచిగనా? ఏదో కాళ్లు సేతులాడినన్ని దినాలు తొక్కులాడాల, కూసుండి తింటే గుట్టలు గూడా కర్గుతై."

కొడుకు సంపాదన దుబారాగా ఖర్చుచేసి అప్పులు చేసే కొందరి తండ్రులకూ... రజాక్ బాబాకూ ఎంత బేధం?

బాబా కొడుకు ఏజాజ్ తన ఈడువాడే. ఏడవ తరగతి వరకు చదివి చిన్న చిన్న పనులు చేయడం మొదలుపెట్టాడు.

సైకిల్ రిపేరింగ్, తండ్రి హోటల్లో సర్వర్, సైకిల్‌పై తిరిగి గాజులు, ఐస్‌ఫ్రూట్ అమ్మడం, ఏజాజ్ చేసిన కొన్ని పనులు.

మా తాలూకాకు కరెంటు రాగానే, ఊరి ఎలక్ట్రికల్ అసిస్టెంటు దగ్గర, అసిస్టెంటుగా కుదిరాడు.

స్వతహాగా చురుకైన వాడవడంవల్ల పనిలో మెలకువలు సులువుగానే నేర్చుకున్నాడు.

తాలూకా ఊరైన ఆర్మూరులో మోటర్ వైండింగ్, పంపులూ, పంఖాలూ, మోటార్లు రిపేరు చేయడం కూడా నేర్చుకున్నాక ఒక ఏజెంటు ద్వారా రియాద్-సౌది అరేబియాలో ఎలక్ట్రిషియన్‌గా స్థిరపడ్డాడు.

ఇప్పుడు నెలకు పదహారు వేలు జీతం. తండ్రి రజాక్ పేర ఐదు వేలు, భార్య నసీంబాను పేర ఐదువేలు నెల నెలా, దొన్కల్‌లోని "స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్"కు పంపిస్తున్నాడు.

"రంజాన్ ఒక్క పొద్దులున్నప్పుడన్న ఇంట్ల కూసుండి ఆరాంసేత్తే, ఏం బాబా? మీరు ఉపాసాలుంటే నీళ్లు గూడా తాగరాయె" సంభాషణ కొనసాగించాను.

"ఒక్క పొద్దులప్పుడు ఆరాంజెత్తే అల్లాకు ఖుషీకాదు బేటా, ఈ టైముల ఎంత ఎక్కువ పనిజేత్తే అంత పాయిదా ఉంటది."

రంజాన్ నెలలో మహ్మదీయులు కఠిన ఉపవాసం చేస్తారు. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ పచ్చి మంచినీళ్లు కూడా ముట్టరు. నోట్లోని లాలాజలం కూడా మింగరు.

సూర్యాస్తమయం కాగానే ఏ ఖర్జూరపండుతోనో, మంచినీళ్లతోనో ఉపవాసం విడుస్తారు. ఆ తర్వాత నమాజు చేసి "ఇఫ్తార్"లో రకరకాల తినుబండారాలు, పళ్లూ, ఫలాలూ తింటారు. ఖురాన్ పారాయణం చేసి పడుకుంటారు.

సూర్యోదయానికి రెండు గంటల ముందే లేచి నమాజు చదివి భోంచేస్తారు.

సూర్యోదయం కాగానే మళ్లీ వాళ్ల ఉపవాసం మొదలు.

రంజాన్ నెల ముప్పై రోజులూ, రోజుకి ఐదుసార్లు నమాజు, క్రమం తప్పకుండా చేస్తారు. చంద్రుణ్ణి చూసి రోజాలు మానేస్తారు.

రజాక్ బాబా ఈ వయసులో కూడా నియమం తప్పలేదు. తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా నియమ నిష్టలు పాటిస్తున్నాడు.

"శాతగానప్పుడు ఎక్కువ తిప్పలేంటికి పడాల బాబా, తబియతింకా ఖరాబైతది గదా!" అన్నాను.

"ఏందో ఏమో గాని, ఇంట్ల ఉంటే మనసున్నే బట్టది. మనసంత ఇటు దిక్కే ఉంటుంది. ఈడ అందర్నీ పల్కరించి, ఏం గావాల్నో అది ఆల్లకు సేసిత్తేగాని మనసున పట్టది."

"సేతి కింద ఒక పిల్లగాన్ని పెట్టుకుంటే పోదా బాబా!"

"ఇద్దరు ముగ్గురు పోరగండ్లను తెస్తే, ఒక్కడు నెగులకపాయ! నాకు ఉశారులేదని హోటలు బందుపెడ్తే ఎందరికి పరేశాన్? ఇగ ఈ జిందగీ ఇట్లనే పోనీ, నల్గురికి సేవసేత్తేనే 'అల్లా' దువా ఇత్తడు. జన్నత్‌ల జాగ దొర్కుతది."

బజ్జీలు తినడం కాగానే, వేడివేడి టీ ఇచ్చాడు బాబా. మళ్ళీ బజ్జీలు వేయడం కొనసాగించాడు. ఎలక్ట్రిషియన్ ఏజాజ్ తండ్రి హోటల్లో... ఎలక్ట్రిసిటీ లేదు. కొడుకు సంపాదిస్తున్నా తండ్రికి వెసులుబాటు లేదు!

అయినా ఆయన కళ్ళల్లో సంతృప్తి! ఒక వేదాంతి ముఖంలోని వర్చస్సు!

రజాక్ బాబా హోటల్ నడిపేది ఒక వ్యాపారంగా కాదు. ఇప్పుడైతే బ్రతుకు తెరువుకు కూడా కాదు.

పనియే ప్రత్యక్ష దైవం.

"మానవ సేవయే మాధవ సేవ"

ప్రత్యక్ష ఉదాహరణ రజాక్ బాబా.

తాను కాలుతూ లోకానికి వెలుగునిస్తుంది చమురు దీపం.

తాను ఉపవాసం ఉన్నా తన ఒంట్లో శక్తి లేకపోయినా, ప్రయాణీకుల బాగోగులు చూస్తాడు... రజాక్ బాబా!

చమురు దీపం.

రజాక్ బాబా.

ఇద్దరిలో ఎంత సామ్యం!

ఇలా ఆలోచిస్తూ బస్సు కొరకు ఎదురు చూస్తున్నాను.

ఉద్యోగావకాశాలు కల్పించలేదని గవర్నమెంటును ఆడిపోసుకోవడంతోనే కాలం గడుపుతున్న యువతరం... స్వయం ఉపాధి పథకాల గురించి ఆలోచించదేం?

రజాక్ బాబాలా, సేవా దృక్పథంతో కాకపోయినా భృతి కొరకైనా ఏదైనా పని చేయవచ్చునే!

తగిన రవాణా సౌకర్యాలు లేని దొన్కల్ లాంటి ఊళ్లల్లో ఆటోరిక్షాలు నడిపినా ఉపాధి కల్గుతుందే?

రజాక్ బాబా లాంటి చమురు దీపాల వెలుగులోనైనా మన యువతరం బ్రతుకు బాట కనుక్కోకపోతే ఎలా?

**(అమృత కిరణ్ పక్షపత్రిక 1995 పోటీల్లో రెండవ బహుమతి 1-4-1995 మహారాష్ట్రలో బాలభారతి తెలుగు 8వ తరగతి పుస్తకంలో పాఠ్యాంశం)**